18 లోపు మద్యం దుకాణాలకు దరఖాస్తు చేసుకోవాలి

మలక్‌పేట: తెలంగాణలోని 2620 రిటైల్ మద్యం దుకాణాల కేటాయింపునకు ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసిందని, ఈ నెల 18 తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని మలక్‌పేట ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ నరేందర్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. దరఖాస్తు రుసుం రూ. 3 లక్షలు చెల్లించి డీపీఈవో కార్యాలయం, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కమిషనర్ కార్యాలయంలో దరఖాస్తులు స్వీకరించబడతాయన్నారు.

26న బ్రాహ్మణ వధూవరుల పరిచయ వేదిక

ఎల్‌బీనగర్: రాష్ట్ర బ్రాహ్మణ సంక్షేమ సంఘం అధ్వర్యంలో అర్హత కలిగిన బ్రాహ్మణ యువతీ యువకులకు వివాహ పరిచయ వేదిక ఈ నెల 26న నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ అధ్యక్షులు పోచంపల్లి శ్రీధర్‌రావు, కార్యదర్శి నందిరాజు లక్ష్మీనారాయణలు తెలిపారు. దరఖాస్తులు బీఎన్‌రెడ్డినగర్ డివిజన్‌లోని గాయత్రీభవన్‌లో అందుబాటులో ఉంటాయని ఈ నెల 16వ తేదీలోపు దరఖాస్తులు చేసుకున్న వారి వివరాలను వివాహ పరిచయ వేదిక రోజున అందిస్తామన్నారు. వనస్థలిపురంలోని గురుద్వారా పక్కన ఉన్న రామాలయంలో నిర్వహిస్తున్నామని మరిన్ని వివరాలకు 9848779434 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

ఎల్‌బీనగర్ డీసీపీగా అనురాధ



నాగోలు: రాచకొండ పోలీస్ కమిషనరేట్ ఎల్‌బీనగర్ జోన్ డీసీపీగా అనురాధ బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ఐఏఎస్, ఐపీఎస్‌ల బదిలీల్లో భాగంగా ఎల్‌బీనగర్ డీసీపీగా పనిచేసిన ప్రవీణ్‌కుమార్ ఏసీబీ జాయింట్ డైరెక్టర్‌గా బదిలీపై వెళ్లగా సిద్దిపేట పోలీస్ కమిషనర్‌గా ఉన్న అనురాధ ఎల్‌బీనగర్ జోన్ డీసీపీగా బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఎల్‌బీనగర్ జోన్ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణ కోసం నిరంతరం కృషి చేస్తానన్నారు. ప్రజల్లో భద్రతా భావాన్ని పెంచడానికి విజిబుల్ పోలీసింగ్, నిరంతరం పెట్రోలింగ్ (గస్తీ) నిర్వహిస్తామన్నారు.

శుభాకాంక్షలు..

హస్తినాపురం: ఎల్‌బీనగర్ జోన్ నూతన డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్‌గా పదవీ భాధ్యతలు తీసుకున్న అనురాధరెడ్డిని హస్తినాపురం డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శశిధర్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

పనుల పరిశీలన



రోడ్డు పనులను పరిశీలిస్తున్న నర్సింహాయాదవ్

వనస్థలిపురం: వనస్థలిపురం డివిజన్ పరిధిలోని శ్రీకృష్ణానగర్ కాలనీలో టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కిగౌడ్ సహకారంతో రూ. 45 లక్షలతో సీసీ రోడ్డు, డ్రైనేజీ పైపులైన్ పనులు మంజూరయ్యాయని కాంగ్రెస్ పార్టీ వనస్థలిపురం డివిజన్ అధ్యక్షుడు, కాలనీ అధ్యక్షుడు కుట్ల నర్సింహాయాదవ్ తెలిపారు. మంగళవార్ధాయన కాలనీలో జరుగుతున్న రోడ్డు, డ్రైనేజీ పనులను కాలనీ వాసులతో కలిసి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వెంకటేష్, యాదగిరిరావు, శ్రీనివాస్ రెడ్డి, అంజయ్య, శ్రీనివాసరావు, లింగమయ్య, శేఖర్‌గౌడ్, ఆశిష్‌రెడ్డి పాల్గొన్నారు.

అన్నదానం



అన్నప్రసాద వితరణలో శ్రీనివాస్‌గుప్తా

నాగోలు: ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ మహిళ విభాగం ఆధ్వర్యంలో పౌర్ణమి సందర్భంగా మంగళవారం కొత్తపేట విద్యుత్ కార్యాలయం వద్ద అన్నప్రసాద వితరణ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఉప్పల శ్రీనివాస్ గుప్తా పాల్గొని మాట్లాడుతూ.. అన్ని దానాల కన్నా అన్నప్రసాద వితరణ కార్యక్రమం గొప్పదన్నారు. ఈ కార్యక్రమంలో చంద్రశేఖర్ గుప్తా, ఉప్పల స్వప్న, భాగ్యలక్ష్మి, మానిమాల, పద్మ, పద్మజ, గోలి సరిత, పోలా అర్చన, కావ్య, చందా సుధాకర్ పాల్గొన్నారు.

సంగీత, నృత్య డిప్లొమా కోర్సుల ఫలితాలు విడుదల

నాంపల్లి: తెలుగు విశ్వవిద్యాలయానికి అనుబంధంగా రెండు తెలుగు రాష్ట్రాల్లో కొనసాగుతున్న 14 ప్రభుత్వ, సంగీత, నృత్య పాఠశాలలు, కళాశాలల్లో జూన్ 2025న నిర్వహించిన డిప్లొమా, సర్టిఫికెట్ కోర్సుల వార్షిక పరీక్షల ఫలితాలు వెల్లడయ్యాయి. మంగళవారం మధ్యాహ్నం 12 గంటలకు వర్సిటీ ఉపాధ్యక్షుడు ఆచార్య వెల్దండ నిత్యానందరావు అధ్యక్షతన ఏర్పాటైన కమిటీ సమావేశంలో ఫలితాలను విడుదల చేశారు. ఈ ఫలితాలను తెలుగు వర్సిటీ వెబ్‌సైట్‌లో వీక్షించవచ్చన్నారు.

పాదచారికి దారేది?



నారాయణగూడ చౌరస్తాలో రోడ్డుకిరువైపుల వ్యాపారాలు

కబ్జాలకు గురవుతున్న ఫుట్‌పాత్‌లు

- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు, పాదచారులు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు

కాచిగూడ: లక్షలాది రూపాయల వ్యయంతో బల్దియా పాదచారుల కోసం ఏర్పాటు చేసిన ఫుట్‌పాత్‌లు కబ్జాకు గురవుతున్నాయి. కాచిగూడ డివిజన్ లోని బర్కత్‌పుర, నారాయణగూడలో పలు చోట్ల వ్యాపారులు, స్థానిక నాయకులు కొందరు దర్జాగా ఫుట్‌పాత్‌లను కబ్జా చేసుకున్నారు. వీటిని కొంత మంది అద్దెకు ఇస్తున్నారు. వివిధ రకాల వ్యాపారులు, హోటళ్లు, ఫుట్‌పాత్‌లను కబ్జా చేయడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. కాలనీల్లో అధికారులు చెట్ల కొమ్మలను కొట్టివేసి అక్కడే ఫుట్‌పాత్‌లపై, రోడ్లపై పడవేశారు. నెలలు గడుస్తున్నా వాటిని తొలగించడంలో పూర్తి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు.

రోడ్డుపైనే పాదచారుల రాకపోకలు...

- నారాయణగూడ, వైఎంసీఏ, బర్కత్‌పుర, కాచిగూడ స్టేషన్ తదితర ప్రాంతాల్లోని ప్రధాన రహదారులకు అనుకొని ఉన్న ఫుట్‌పాత్‌లు కబ్జా చెరలో ఉంటున్నాయి.
- నింబోలిఅడ్డ, గోల్నాక వరంగల్ జాతీయ రహదారిని రోడ్డు ఉయం నుంచి రాత్రి వరకు వాహనదాల రద్దీతో ఉంటాయి.
- బర్కత్‌పురలో తాము ప్రతి రోజు ఉదయం పూట వాకింగ్ చేస్తుంటామని, అయితే ఫుట్‌పాత్‌లపై చెట్ల కొమ్మలు, ఇటుక, ఇసుక, చెత్త చెదారం పేరుకుపోయి ఉంటున్నాయని, గత్యంతరం లేక రోడ్డుపైనే వాకింగ్ చేస్తున్నామని వాకర్స్ అంటున్నారు.

ఫుట్‌పాత్‌లపైనే భవన నిర్మాణ సామగ్రి..

- జీహెచ్‌ఎంసీ అంబర్‌పేట సర్కిల్ పరిధిలోని కాచిగూడ, గోల్నాక, నల్లకుంట, అంబర్‌పేట, బాగ్ అంబర్‌పేట, హిమాయత్‌నగర్ తదితర ప్రాంతాల్లో రామదారులపై ఫుట్‌పాత్‌లపై భవన నిర్మాణ సామగ్రి గుట్టలుగా పోసి అమ్ముతున్నారు. రోట్లపై ఇసుక, ఇటుకతో నిండిన మినీ ట్రక్కులు కూడా ఉంటున్నాయి. దీంతో రోడ్లు కాస్తా ఇరుకుగా మారుతున్నాయి. భవన నిర్మాణదారులు తమ ఇంటి నిర్మాణ సామగ్రిని సైతం ఇంటి ముందే రోడ్డుపై వేస్తున్నారు.
- కాచిగూడ చౌరస్తాలో రోడ్డుపైనే హోటళ్ల ముందు ట్రాఫిక్ పోలీసులు నో పార్కింగ్ బోర్డు ఏర్పాటు చేసినా కార్లు ఇష్టానుసారంగా నిలుపుతుండటంతో చౌరస్తాలో నిత్యం ట్రాఫిక్ జామ్ అవుతోంది. ద్విచక్ర వాహనాలు ఫుట్‌పాత్, రోడ్డుపైనే పార్క్ చేసి ఉంచుతున్నారు.

హోటళ్ల ముందు సైతం

కాచిగూడ రైల్వే స్టేషన ఎదురుగా హోటళ్ల ముందు ఉదయం నుంచి రాత్రి వరకు ఆటోలు, ద్విచక్ర వాహనాలు, తోపుడు బండ్లు అక్రమంగా పార్కింగ్ చేస్తున్నారు. దీంతో రద్దీ వేళల్లో పాదచారులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.

- కాచిగూడ, నారాయణగూడ, హిమాయత్‌నగర్‌లో హోటళ్ల ముందు ద్విచక్రవాహనాలు, కార్లు పార్కు చేసి ఉంటున్నాయి.
- ఫుట్‌పాత్‌లను కబ్జా చెర నుంచి విడిపించి పాదచారులకు అందుబాటులోకి తీసుకురావాలని పలువురు కోరుతున్నారు.
- ఫుట్‌పాత్ అక్రమణలకు తోడు రోడ్లు కూడా గుంతల మయంగా మారడంతో ప్రజలు పడుతున్న బాధలు వర్ణణాతీంగా ఉంటున్నాయి.
- ఇప్పటికైనా అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి సమస్యల పరిష్కారం దిశగా కృషి చేయాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.



రెడ్డి ఉమెన్స్‌కాలేజ్ రోడ్డులో ఫుట్‌పాత్ రోడ్డుపై పడేసిన చెట్లకొమ్మలు



తెలంగాణ యువతి మండలి ఎదురుగా గుంతలమయంగా మారిన రోడ్డు

అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలి



పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ పవన్‌కుమార్

నాగోలు: అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించి త్వరగా పూర్తి చేయాలని కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్ సూచించారు. న్యూ సమతాపురి కాలనీలో జరుగుతున్న స్టామ్ వాటర్ పైపులైన్ పనులను మంగళవారం కార్పొరేటర్ పరిశీలించి పనుల నాణ్యత, తదితర అంశాలపై ఆరా తీశారు. స్థానికులకు ఇబ్బందులు తలెత్తకుండా సకాలంలో పనులు పూర్తి చేయాలన్నారు. కమర్షియల్ టాక్సీ కాలనీ కమ్యూనిటీ హాల్ భవన నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ పనులు పూర్తయితే కాలనీవాసులకు సమావేశాలు, సాంస్కృతిక కార్యక్రమాలు, సామాజిక సేవా కార్యక్రమాల నిర్వహణకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు ఏఈ షరీఫ్, వర్క్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వరు, న్యూ సమతాపురి అధ్యక్షులు శ్రీనాథ్, సీటీవో కాలని అధ్యక్షులు అంజయ్య, రామకృష్ణ, నాయకోటి ప్రదీప్ కుమార్ పాల్గొన్నారు.

ప్రధాన న్యాయమూర్తిపై దాడి సిగ్గుచేటు



హయత్‌నగర్‌లో నిరసన తెలుపుతున్న నాయకులు

మన్సూరాబాద్: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై దాడి చేయటం, ప్రజాస్వామ్య వ్యవస్థపై దాడి చేయటమేనని సీపీఐ ఎల్‌బీనగర్ నియోజకవర్గ కార్యదర్శి సామిడి శేఖర్‌రెడ్డి అన్నారు. జస్టిస్ బీఆర్ గవాయ్‌పై దాడిని ఖండిస్తూ సీపీఐ హయత్ నగర్ మండల సమితి ఆధ్వర్యంలో మంగళవారం చేపట్టిన నిరసన కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యుడు అందోజు రవీంద్రచారి పాల్గొని మాట్లాడారు. దాడికి పాల్పడిన వ్యక్తి పౌరసత్వాన్ని రద్దు చేసి జీవిత ఖైదు విధించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీదేవి, శోభన్, సుజాత, సుధాకర్, రాములుగౌడ్, వంశీవర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

డ్రైనేజీ సమస్యలు తలెత్తకుండా చర్యలు



సమస్యలు పరిశీలిస్తున్న కార్పొరేటర్

మన్సూరాబాద్: డ్రైనేజీ సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపట్టనున్నట్లు మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి తెలిపారు. డివిజన్ పరిధి ఇందిరానగర్‌కాలనీలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారిందని బస్తీలోని హ్యాండ్ బోర్లు పనిచేయటం లేదని బస్తీ వాసుల ఫిర్యాదు మేరకు జలమండలి అధికారులతో కలిసి కార్పొరేటర్ మంగళవారం బస్తీలో పర్యటించి మాట్లాడారు. డ్రైనేజీ, నీటి సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జలమండలి మేనేజర్ ప్రేమ్‌కుమార్, సూపర్‌వైజర్ సక్రునాయక్ పాల్గొన్నారు.

విద్యార్థిపై దాడి చేసిన యువకుల రిమాండ్

అంబర్‌పేట: బీటెక్ విద్యార్థిపై దాడి చేసిన యువకులను పోలీసులు పట్టుకున్నారు. మంగళవారం అంబర్‌పేట పోలీసుస్టేషన్‌లో విలేకరుల సమావేశంలో కాచిగూడ ఏసీపీ హరీష్‌కుమార్, ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్ వివరాలను వెల్లడించారు. మేడిపల్లిలో నివసించే నరేష్ కుమారుడు అభినవ్ బాగ్‌అంబర్‌పేటలోని తన మామయ్య నివాసంలో జరిగిన పూజకు హాజరయ్యాడు. సోమవారం రాత్రి సమయంలో కొద్దపాటి పరిచయం ఉన్న గౌతంతో స్వల్ప వాగ్వాదం జరిగింది. దీంతో గౌతం అప్పటికప్పుడు అతడి స్నేహితులను పిలిపించి అభినవ్‌పై దాడి చేశారు. సుమారు 20 మంది యువకులు ముకుమ్మడిగా అభినవ్‌పై విచక్షణ రహితంగా దాడి చేశారు. బీరు సీసాలతో దాడి చేయడంతో తీవ్ర గాయాల పాలయ్యాడు. తండ్రి నరేష్ ఫిర్యాదు మేరకు కేసు సమోదు చేసుకున్న పోలీసులు తక్షణమే స్పందించారు. దాడికి పాల్పడ్డ వారిలో ఐదుగురిని అరెస్టు చేశారు. అరెస్టు చేసిన వారిలో స్థానికంగా నివసించే డి.గౌతం(18), డి.సంపత్(20), బి.యశ్వంత్(21), ఏ.శివకుమార్(26), బి.భాస్కర్(22)లు ఉన్నారు. వీరిని రిమాండ్‌కు తరలించారు. వరుస నేరాలకు పాల్పడితే రౌడీషీట్ తేరుస్తామని ఈ సందర్భంగా ఏసీపీ హెచ్చరించారు.

రైతు బజారులలో కూరగాయల ధరలు



వనస్థలిపురం: సరూర్‌నగర్/వనస్థలిపురంలోని రైతుబజార్‌లలో కూరగాయల ధరలు.. టమాట రూ.23, వంకాయ 35, బెండ 35, పచ్చిమిర్చి 55, కాకర 35, బీర 45, క్యాబేజి 23, ఫ్రెంచి బీన్స్ 55, క్యారెట్ 55, దొండ 35–40, చిక్కుడు 55, గోకర 55, బీట్‌రూట్ 40, క్యాప్సికం 55, ఆలు 24, దోస 18, సొర 15, పొట్ల 18, ఉల్లిగడ్డ 19, చామగడ్డ 25.ఈ ధరలు బుధవారం ఉదయం 9 గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి.

వికలాంగుల కార్పొరేషన్ ఉద్యోగులకు 3 పీఆర్సీలు

చాదర్‌ఘాట్: వికలాంగుల కార్పొరేషన్ ఉద్యోగులకు మూడు పీఆర్సీలను ప్రభుత్వం మంజూరు చేసింది. 2010, 2015, 2020 పీఆర్సీలను ఇస్తూ బుధవారం కొత్త పీఆర్సీలతో జీతం చెల్లించింది. మంగళవారం మలక్‌పేటలో కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్య మాట్లాడుతూ.. ఒక్కో ఉద్యోగికి సగటున రూ. 55 వేల వేతనం పెరిగిందన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, వికలాంగుల శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కు కృతజ్ఞతలు అన్నారు. గత ప్రభుత్వంలో పీఆర్సీల కోసం ఉద్యోగులు ఎంతో ఎదురు చూశారని, 15 ఏళ్ల తర్వాత ఈ డిమాండ్ నెరవేరిందన్నారు. కార్పొరేషన్‌లో 35 మంది ఉద్యోగులు ఉన్నారన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

మన్సూరాబాద్: మన్సూరాబాద్ డివిజన్ పరిధి ఆటోనగర్‌లో మంగళవారం సీఐటీయూ హయత్ నగర్ సర్కిల్ జనరల్ బాడీ సమావేశం నిర్వహించి జిల్లా కార్యదర్శి చంద్రమోహన్ సమక్షంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. కన్వీనర్‌గా చింతపల్లి కృష్ణయ్య, కమిటీ సభ్యులుగా నరహరి, అంజనేయులు, సుందర్‌రావు, దాయనంద్, సుభద్ర, శ్రీదేవి, లింగంయాదవ్, లింగస్వామి, నవనీత, సింహాద్రి, లక్ష్మమ్మ, అంజయ్య, నగేష్, చుక్కమ్మ, వజ్రమ్మ, అశోక్, నరసింహను ఎన్నుకున్నారు.

ట్రాన్స్‌ఫార్మర్లకు కంచె ఏర్పాటు చేయాలి

దిల్‌సుఖ్‌నగర్: కాలనీల్లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టు కంచెను ఏర్పాటు చేయకపోవడంతో ప్రమాదకరంగా మారాయి. మలక్‌పేట్‌జోన్ పరిధిలో పలు చోట్ల ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద కంచె లేకపోవడంతో ప్రమాదకరంగా మారాయి. విద్యుత్ స్తంభాలు, వేలాడుతున్న విద్యుత్ తీగలతో ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని స్థానికులు ఆందోళనకు గురవుతున్నారు. కంచె లేని ట్రాన్స్‌ఫార్మర్ కారణంగా గతంలో చిన్న పిల్లలు, పశువులు ప్రమాదాల బారిన పడ్డా అధికారులు నిర్లక్ష్యం వీడడం లేదు. ముఖ్యంగా ఆర్‌కేపురం, మాదన్నపేట్, కుర్మగూడ, సరూర్‌నగర్, చావుణి, మాదన్నపేట్, సైదాబాద్, అక్బర్‌బాగ్,ఎన్‌సటీఆర్‌నగర్ తదితర ప్రాంతాల్లోని ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా మారాయి. సంబంధిత అధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ కంచె ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

బస్సు చార్జీల పెంపు క్షమించరాని నేరం

ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి



ప్రయాణికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

ఎల్‌బీనగర్: కాంగ్రెస్ ప్రభుత్వం బస్సు చార్జీలను పెంచి పేద సామాన్య మధ్యతరగతి ప్రజలను మోసం చేసిందని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. బస్సు చార్జీల పెంపును నిరసిస్తూ మంగళవారం ఆయన ఎమ్మెల్యేలు కాలేరు వెంకటేశ్, ముఠాగోపాల్‌తో గాంధీభవన్ నుంచి అసెంబ్లీ వరకు బస్సులో ప్రయాణించి ప్రయాణికుల నుంచి అభిప్రాయాలను సేకరించారు. ఈ సందర్భంగా సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ.. బస్సు చార్జీలు పెంపు క్షమించరాని నేరమన్నారు. మహాలక్ష్మీ పథకంతో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించి ఆ లోటును పూడ్చేందుకు చార్జీల పెంపుతో ప్రజల నడ్డి విరిస్తున్నారని మండిపడ్డారు. ఆర్టీసీ ప్రయాణికులపై ఏకంగా ఒకేసారి రూ.10 పెంచి పేద మధ్యతరగతి ప్రయాణికుల జేబులను కొల్లగొట్టారని అన్నారు. ఇప్పటికే విద్యార్థుల బస్ పాస్‌లు, టీ–24 టికెట్ల ధరలు పెంచారని పేదలపై రేవంత్‌రెడ్డి సర్కార్‌కు కనికరం లేకుండాపోయిందని అన్నారు.ధరలు పెంచడం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అసమర్థతర్థత విధానాలకు నిదర్శమన్నారు.

పరామర్శ

ఎల్‌బీనగర్: అమెరికాలో దుండగుల కాల్పుల్లో మృతి చెందిన బీఎన్‌రెడ్డి నివాసి పోలే చంద్రశేఖర్ మృతదేహాన్ని ఆదివారం వరకు నగరానికి తీసుకొచ్చే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన పోలే చంద్రశేఖర్ కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. అమెరికాలో ఉంటున్న తెలుగు సంఘం ప్రజలతో సంప్రదింపులు జరుపుతున్నామన్నారు.

మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం



రహదారి పనులు ప్రారంభించిన కార్పొరేటర్

సైదాబాద్: ఐఎస్‌సదన్ డివిజన్ పరిధిలోని కాలనీలు, బస్తీల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం ఇస్తున్నామని కార్పొరేటర్ జంగం శ్వేతా మధుకర్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆమె లక్ష్మీనగర్ కాలనీలో రూ. 12.50 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మిస్తున్న సీసీ రహదారి పనులను కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. ఐఎస్‌సదన్ డివిజన్‌లో కొనసాగుతున్న పలు అభివృద్ధి పనుల్లో కాంట్రాక్టర్లు నాణ్యతా ప్రమాణాలు కచ్చితంగా పాటించాలన్నారు. ఆయా ప్రాంతాల్లో పనులను స్థానికులు సైతం తరచూ పరిశీలిస్తుండాలని ఏమైనా అవకతవకలు చోటుచేసుకుంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ ఏఈ శిరీష, నాయకులు జంగం మధుకర్‌రెడ్డి, కాలనీవాసులు చంద్రశేఖర్‌రెడ్డి, బాలకృష్ణ, సురేందర్, ప్రఫుల్ కుమార్, కృష్ణయ్య, మోహన్‌రావు, జీవన్‌రెడ్డి పాల్గొన్నారు.

పనుల పూర్తికి ఎంపీకి వినతి



ఎంపీ ఈటలకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

నాగోలు: నాగోలు ధోబీఘాట్‌లో పెండింగ్‌లో ఉన్న పనులను వెంటనే పూర్తి చేయాలని రజక సంఘం నాయకులు మంగళవారం మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు బొడ్డుపల్లి చుక్కయ్య, బి. కృష్ణ మాట్లాడుతూ.. నాగోలు ధోబీఘాట్‌లో అసంపూర్తిగా ఉన్న కాంపౌండ్ వాల్, కమ్యూనిటీ హాల్, ధోబీఖానాలు, బాత్రూమ్, హైమాస్ లైట్స్, మంచినీటి కనెక్షన్ ఇతర మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరగా స్పందించిన ఎంపీ మాట్లాడుతూ.. నాగోలు ధోబీఘాట్‌లోని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో రజక సంఘం నాయకులు మధు, మహేందర్ పాల్గొన్నారు.

బూత్‌స్థాయి కమిటీల ఏర్పాటు అత్యవసరం



సమీక్షా సమావేశంలో పాల్గొన్న బీజేపీ నాయకులు

మన్సూరాబాద్: డివిజన్లలోని ప్రతిబూత్‌స్థాయిలో కమిటీల ఏర్పాటు అత్యవసరమని, శక్తికేంద్రాలు పార్టీకి జీవనాడులని బీజేపీ రంగారెడ్డి జిల్లా మాజీ అధ్యక్షుడు సామ రంగారెడ్డి అన్నారు. మన్సూరాబాద్‌లోని రంగారెడ్డి జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు వనిపల్లి శ్రీనివాస్‌రెడ్డి అధ్యక్షతన ఎల్‌బీనగర్ నియోజకవర్గ డివిజన్, మోర్చా, బూత్‌కమిటీలు, శక్తి కేంద్రాల ఇన్‌చార్జిలతో మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జీఎస్‌టీ తగ్గింపుపై ప్రజల్లో చైతన్యం పెంపొందించి కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించాలన్నారు. ప్రతి కార్యకర్త పార్టీ పటిష్టతకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో శంకర్, రాజేంద్రప్రసాద్, నరేష్‌యాదవ్, నూతి శ్రీనివాసరావు, సుందర్‌నారాయణ పాల్గొన్నారు.

చికెన్ దుకాణాల నిర్వాహకులను ఆదుకోవాలి



సమావేశంలో అసోసియేషన్ సభ్యులు

చంపాపేట: చికెన్ విక్రయ కేంద్రాల నిర్వహణలో కార్పొరేటర్ సంస్థలు ప్రవేశించటంతో స్థానిక చికెన్ షాప్ నిర్వాహకులకు గిరాకీ లేక ఇబ్బందులు తలెత్తున్నాయని వారిని ప్రభుత్వమే ఆదుకోవాలని చంపాపేట డివిజన్ చికెన్ షాప్‌ల ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కృష్ణయాదవ్ కోరారు. మంగళవారం చంపాపేట క్రికెట్ క్లబ్ ఆవరణలో వేణుబాబు చౌదరి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సభ్యుల సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. కార్పొరేట్ వ్యాపార కేంద్రాలు చికెన్ ధరలపై ఆఫర్ల ప్రకటించటంతో పాటు మార్కెట్ ధర కన్నా తగ్గించి విక్రయిస్తుండటంతో గిట్టుబాటు ధరను తగ్గించి పత్రికల్లో ప్రకటనలు ఇవ్వటంతో స్థానిక వ్యాపారులకు నష్టాలు వస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో బాలరాజ్, ఖాదర్, రాజవర్ధన్‌రెడ్డి, కరుణాకర్, సురేష్, సుధాకర్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, గణేష్, అంజి, రాము పాల్గొన్నారు.

నియామకం



బోస్లే శ్రీనివాసరావుకు నియామక పత్రం అందిస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

లింగోజిగూడ: రంగారెడ్డి జిల్లా బీజేపీ కౌన్సిల్ సభ్యులుగా లింగోజిగూడకు చెందిన బోస్లే శ్రీనివాసరావు నియమితులయ్యారు. ఈ మేరకు జిల్లా బీజేపి అర్బన్ అధ్యక్షుడు వనిపల్లి శ్రీనివాస్‌రెడ్డి మంగళవారం నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ.. నగరంలో పార్టీని బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని, తనపై నమ్మకం ఉంచి బాధ్యతలను అప్పగించిన నాయకులకు కృతజ్ఞతలు అన్నారు.

చెట్లు నరికేసిన వారిపై చర్యలు తీసుకోవాలి



హస్తినాపురం: ఏపుగా పెరిగిన చెట్లను నరికివేస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సెంటర్ ఫర్ సోషియోకల్చర్ అండ్ ఎన్విరాన్మెంట్ ప్రొటెక్షన్ సెక్రటరీ సన్ని హెరాక్లియస్ డిమాండ్ చేశారు. సోమవారం చైన్యనగర్‌లోని రాత్రి 30 సంవత్సరాల రావిచెట్టును నరికి లారీలో తరలించాలని బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

నాంపల్లిలో గంజాయి పట్టివేత

నాంపల్లి: గంజాయి విక్రయిస్తున్న ఓ వ్యక్తిని ఎస్టీఎఫ్ఏ పోలీసులు అరెస్టు చేశారు. ఈ కేసుతో సంబంధం ఉన్న మరో ముగ్గురిపై కేసు నమోదు చేశారు. ఎస్టీఎఫ్ఏ టీం లీడర్ అంజిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం..నాంపల్లి మెట్రో రైల్వే స్టేషన్ సమీపంలో గంజాయి విక్రయిస్తున్నారనే సమాచారం వచ్చింది. వెంటనే అక్కడికి చేరుకుని గంజాయిని విక్రయిస్తున్న హట్‌గోడ సంజయ్ అనే వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. అతడి వద్ద ఉన్న 2.5 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. గంజాయితో పాటుగా ఒక ద్విచక్రవాహనాన్ని, ఒక సెల్‌ఫోన్‌ను సీజ్ చేశారు. ఈ కేసుతో సంబంధం ఉన్న శేఖర్ బాబు, కామ్రే బాబు, గంగోలి బహు అనే ముగ్గురిపై కేసు నమో దు చేశారు. ఈ ముగ్గురు పరారీలో ఉన్నట్లు అంజిరెడ్డి తెలిపారు. నిందితుడిని నాంపల్లి ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌లో అప్పగించినట్లు తెలిపారు.